నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 | శుక్రవారం 29 డిసెంబర్ 2023 | WARANGAL HANUMAKONDA


### తవ్వకాల్లో బయటపడిన
# పురాతన విగ్రహాలు



పాలకుర్తిలో పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల తవ్వకాల్లో బయట పడిన పురాతన విగ్రహాలు

పాలకుర్తి, డిసెంబర్ 28 : మండల కేంద్రంలో పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణ కోసం చేపట్టిన తవ్వకాల్లో గురువారం పురాతన విగ్రహాలు బయటపడ్డాయి. పిల్లర్ గుంతలు తవ్వుతుండగా ఈ విగ్రహాలు బయటపడినట్లు కూలీలు తెలిపారు. రాతిబండ పై రెండు పాదాలతో కూడిన రూపం కలిగి ఉందని పేర్కొన్నారు. పురావస్తుశాఖ అధికారులు ఈ విగ్రహాలను పరిశీలిస్తే ఏ కాలానికి చెందినవో తెలుస్తుందని స్థానికులు తెలిపారు.

# మేడారం ఆదాయం రూ. 39.84 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

తాడ్వాయి, డిసెంబర్ 28 : మేడారం సమ్మక్క, సారలమ్మల హుండీల ద్వారా రూ. 39,84,959 ఆదాయం లభించింది. గత సెప్టెంబర్ మాసంలో అమ్మవార్ల గద్దెలపై 22 హుండీలు ఏర్పాటు చేయగా అవి భక్తులు వేసిన కానుకలతో నిండుకోవడంతో గురువారం దేవాదాయ శాఖ అధికారులు అమ్మవార్ల పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో లెక్కింపును ప్రారంభించారు. సమ్మక్క హుండీల్లో రూ. 23,43,970, సారలమ్మ హుండీల్లో 14,55,925, గోవిందరాజు హుండీల్లో రూ. 94,096, పగిడిద్దరాజు హుండీల్లో రూ. 88,096 లభించినట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని మండల కేంద్రంలోని కెనరా బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు.



| | |
|---|---|
| వరంగల్ నగరం | 18516 |
| హనుమకొండ | 4149 |
| వరంగల్ | 8600 |
| మహబూబాబాద్ | 15428 |
| జనగామ | 10502 |
| భూపాలపల్లి | 4858 |
| ములుగు | 4420 |

హయగ్రీవాచారి గ్రౌండ్ వాటర్ ట్యాంకు వద్ద ఫారాల కోసం ఎగబడుతున్న దరఖాస్తుదారులు

### ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

- పల్లె, పట్నం తేడాలేకుండా కేంద్రాలు కిటకిట
- కొన్నిచోట్ల ఫారాలు అందక ఇబ్బందులు, అధికారులతో వాగ్వాదం
- జిరాక్స్ సెంటర్లలో రూ.10 నుంచి రూ.30 చొప్పన విక్రయాలు
- రేషన్ కార్డు కోసం తెల్లకాగితాలపై అర్జీలు



# అర్జీలు ఝరూ

రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పేరిట చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గురువారం ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైంది. అర్జీలు సమర్పించేందుకు ప్రజలు కేంద్రాల్లో బారులు తీరి కనిపించారు. చాలాచోట్ల ఇంటింటికీ దరఖాస్తులు అందినా, కొన్నిచోట్ల అమలు కాక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిరాక్స్ సెంటర్లలో డబ్బులు వెచ్చించి మరీ దరఖాస్తు ఫారాలు కొనుగోలు చేసి సమర్పించారు. ముఖ్యంగా ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, 200 యూనిట్ల కరెంటు, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఇచ్చే విషయంలో అయోమయానికి లోనయ్యారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 28

మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకం వంటి ఆరు గ్యారెంటీల కోసం తొలి రోజు ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. రెండు పేజీల ఫారంలో దరఖాస్తుదారుకు సంబంధించిన కుటుంబ వివరాలు రాయాలని, దరఖాస్తుకు ఆధార్‌కార్డు, తెల్ల రేషన్‌కార్డు జిరాక్స్ ప్రతిని జత చేయాలని సూచించారు. మొదటి పేజీలో ఆధార్ నంబర్, పుట్టినతేదీ, రేషన్‌కార్డు నంబర్ అడిగారు. దరఖాస్తు ఫారంలో కొత్త రేషన్‌కార్డు కోసం ప్రత్యేకంగా కాలమ్ లేకపోవడంతో తెల్లకాగితంపై రాసి ఇవ్వాల్సి వస్తున్నది. ఇల్లులేని అర్హులైన కుటుంబాలకు ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం కాలమ్ మాత్రమే ఉండగా సొంత స్థలం లేక అద్దె ఇళ్లలో ఉంటున్నవారు ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక అయోమయానికి గురయ్యారు. దీనికోసం కూడా ప్రత్యేకంగా తెల్లకాగితంపై రాసి ఇవ్వడం కనిపించింది. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కాలమ్‌లో వాడుకునే యూనిట్ల సంఖ్యపైనా అయోమయం నెలకొంది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అద్దె ఇంట్లో ఉండేవారికి ఎలా వర్తిస్తుందో తెలియక గందరగోళం నెలకొంది. ఒకే దరఖాస్తుతో ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ ఇవ్వచ్చని చెప్పి కౌంటర్ వద్దకు వెళ్లిన వారికి తెల్లకాగితంపై రాసిచ్చే దరఖాస్తుకు అదనంగా జిరాక్స్ ప్రతులు అడగడంతో జిరాక్స్ సెంటర్లకు ప్రజలు పరుగులు తీయడం కనిపించింది.



కొత్తూరు జెండా ప్రాంతంలో దరఖాస్తు ఫారాల కోసం వేచి చూస్తున్న మహిళలు

### ఆయా చోట్ల పాల్గొన్న ఎమ్మెల్యేలు

జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, జనగామలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, దొంతిమాధవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మురళీనాయక్, రాంచంద్రునాయక్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో అధికారులు అర్జీల స్వీకరణను పర్యవేక్షించారు. ఒక గ్రామంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మరో గ్రామంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తులు తీసుకున్నారు. కొన్ని గ్రామాల్లో పొలం పనులకు వెళ్లిన వారు సాయంత్రం వచ్చే సరికే అధికారులు వెళ్లిపోవడంతో హైరానా పడ్డారు. స్థానిక నాయకులు, అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని, లేదంటే పక్క ఊరికి వెళ్లి దరఖాస్తు ఇవ్వాలని సూచించడం కనిపించింది.

### జిరాక్స్ సెంటర్లలో దరఖాస్తుల విక్రయం

ఇంటింటికీ దరఖాస్తు ఫారాలు అందిస్తామని అధికారులు చెప్పినా కొన్ని చోట్ల అమలు కాకపోడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఫారాలు అందక జిరాక్స్ సెంటర్లకు పరుగులు తీసి కొనుగోలు చేశారు. ఇదే అదునుగా సెంటర్లలో బ్లాక్ అండ్‌వైట్ దరఖాస్తుకు రూ.10 నుంచి రూ.15 చొప్పున, కలర్ జిరాక్స్‌కు రూ.20నుంచి రూ.30 చొప్పున వసూలు చేశారు. దరఖాస్తులను పూరించే విషయంలోనూ చాలామంది అయోమయానికి లోనయ్యారు.కుటుంబ యజమాని పేరు పురుషుడు, మహిళల్లో ఎవరిది రాయాలని గందరగోళపడ్డారు.

### నగరంలో అధికారులతో వాగ్వాదం

వరంగల్ నగరంలో మొదటి రోజు గంటలోపే దరఖాస్తులు అయిపోయాయని సిబ్బంది చెప్పడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని 30వ డివిజన్ శ్రీనివాసనగర్, 51వ డివిజన్ వాటర్ ట్యాంకు వద్ద, 5వ డివిజన్ కొత్తూరుజెండా కమ్యూనిటీ హాల్ వద్ద, 4వ డివిజన్‌లో యాదవనగర్ కమిటీ హాల్, పెద్దమ్మగడ్డ కమ్యూనిటీ హాల్‌లో దరఖాస్తులు ఎందుకివ్వడం లేదని అధికారులను నిలదీశారు. చివరకు బయట జిరాక్స్‌షాపులో కొనుగోలుచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో అక్కడికి పరుగులు పెట్టారు. 27వ డివిజన్ స్టేషన్ రోడ్‌లోని బాపూజీ విజ్ఞాన కేంద్రం, 36వ డివిజన్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సెంటర్లలో దరఖాస్తులు ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఫారాల కోసం వేచివున్న మహిళలు ఆందోళన చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులను నిలదీశారు. 19,20వ డివిజన్లలో ఫారాలు లేక పోవడంతో చాలామంది నిరాశతో వెనుదిరిగారు.

# పనులు వేగవంతం చేయాలి



నీటి పారుదల శాఖ అధికారుల రివ్యూలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- రిజర్వాయర్ల కింద కాల్వలకు మరమ్మతు చేయాలి
- వచ్చే వానకాలం నాటికి సాగు నీరు అందాలి
- సాగునీటిపై ఇక నుంచి ప్రతి నెలా రివ్యూ చేస్తా..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబర్ 28 : వచ్చే వానకాలం నాటికి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని రిజర్వాయర్ల కింద ఉన్న పంట కాల్వలకు మరమ్మతు చేపట్టి, సాగునీరు అందించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన చింతగట్టు దేవాదుల చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో సాగునీటి సమస్య పరిష్కారం కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.104 కోట్లు సంవత్సరం క్రితం మంజూరు చేసిందన్నారు. వాటితో చేపట్టిన పనుల్లో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని పనులు మధ్యలో నిలిచిపోయాయని, ఇంకొన్ని టెండర్లు పూర్తయినప్పటికీ ప్రాజెక్ట్ డిజైన్ చేయకపోవడంతో పనులు ప్రారంభం కాలేదన్నారు. వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి జూన్ చివరి నాటికి పూర్తి చేసి, జూలై సాగునీరు అందించాలని ఆదేశించారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ కింద ఉన్న గ్రావిటీ కెనాల్‌లో కూరకుపోయిన మట్టి, తుంగను తొలగించి మరమ్మతులు చేపట్టాలన్నారు. కాల్వ నిర్మాణంలో భూసేకరణ సమస్యను పరిష్కరించి కాల్వలు నిర్మిస్తే లింగాలఘనపురం మండలంలోని 9 గ్రామాలకు చెందిన 17వేల ఎకరాలతోపాటు ఎగువ ప్రాంతాలకు సైతం సాగునీరు అందుతుందన్నారు. మల్లన్నగండి వద్ద లిఫ్ట్–1 ద్వారా చిల్పూరు మండలంలోని మూడు గ్రామాలకు, వేలేరు మండలంలో మూడు గ్రామాలకు, తరిగొప్పుల మండలంలోని ఆరు గ్రామాలకు కలిపి 6,794 ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు. లిఫ్ట్ – 2 ద్వారా ధర్మసాగర్ మండలం సోడషపల్లితోపాటు ఇంకొన్ని గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. ట్రయల్ రన్‌ను పూర్తి చేసి 12 చెరువులను నింపే ప్రయత్నం చేయాలన్నారు. ధర్మసాగర్ పెద్ద చెరువును రిజర్వాయర్‌గా మార్చుకున్నామని, కానీ, దాని కింద ఉన్న పంట పొలాలకు సాగునీరు అందించడం లేదన్నారు. నక్కల తూము ద్వారా 4వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని కడియం సూచించారు. నష్కల్ రిజర్వాయర్ వద్ద లిఫ్ట్–3 ఏర్పాటు చేయడం వల్ల నష్కల్ గ్రామానికి 1800 ఎకరాలతోపాటు వంగాలపల్లి, ధర్మపురం, మలక్‌పల్లి గ్రామాల రైతులకు సాగునీరు అందుతుందన్నారు. లిఫ్ట్ ఏర్పాటుకు డిజైన్ పూర్తి చేసి పనులను ప్రారంభించాలన్నారు. జఫర్‌గఢ్ మండలంలోని ధంసా చెరువును బ్యాలెన్స్ రిజర్వాయర్‌గా మార్చేందుకు టెండర్లు పూర్తయినా ఇంకా పనులు పూర్తి కాలేదని, జూన్ చివరి నాటికి పనులు పూర్తి చేసి జూలైలో సాగునీరు అందించాలన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ పెద్ద చెరువును, రాజావరం చెరువును కలిపి రిజర్వాయర్‌గా మార్చామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈ రమేశ్ బాబు, ఎస్ఈ సుధాకర్‌రెడ్డి, సుధీర్, ఈఈలు మంగీలాల్, వినయ్‌బాబు, డీఈలు, ఏఈలు, వేలేరు జడ్పీటీసీ చాడ సరిత, ఎంపీపీ సమ్మిరెడ్డి, రాంబాబు, సర్పంచ్‌లు గణపతి పాల్గొన్నారు.



లక్ష్మీ బరాజ్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

### నేడు మేడిగడ్డ, అన్నారానికి
# మంత్రుల రాక

**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ భవేశ్‌మిశ్రా**

మహదేవపూర్/కాళేశ్వరం, డిసెంబర్ 28: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన లక్ష్మీ బరాజ్ (మేడిగడ్డ), అన్నారం (సరస్వతీ బరాజ్)ను నేడు రాష్ట్ర మంత్రుల బృందం పరిశీలించనుంది. మొదట రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ, ఇండ్రస్ట్రీస్, శాసన సభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మేడిగడ్డకు రానున్నారు. బరాజ్‌లో కుంగిన ప్రాంతాన్ని పరిశీలించి బరాజ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు అన్నారం బరాజ్‌కు మంత్రులు చేరుకోనున్నారు. బరాజ్‌లో వస్తున్న నీటి బుడుగలను పరిశీలిస్తారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో మేడిగడ్డ వద్ద ఇరిగేషన్ శాఖ అధికారులు,ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు చేపట్టిన ఏర్పాట్లపై గురువారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా పరిశీలించారు. హెలీ ప్యాడ్, సభా ప్రాంగణం, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

# తెలంగాణ చరిత్ర అత్యద్భుతం

- దేశ చరిత్రలోనే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం గొప్పది..
- కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్
- కేయూలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సదస్సు ప్రారంభం




సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేయూ వీసీ తదితరులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 28 : తెలంగాణ చరిత్ర అద్భుతమైనదని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అన్నారు. సామాజిక అణచివేత, దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు ఇక్కడ జరిగాయన్నారు. గురువారం కేయూ ఆడిటోరియంలో చరిత్ర విభాగం నిర్వహణలో 'ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సదస్సు' నిర్వహించారు. కేయూ వైస్‌చాన్సలర్ ప్రొ.రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ప్రతినిధులు, పరిశోధకులు, చరిత్రకారులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేయూ వీసీ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ వేదికగా 30 సంవత్సరాల క్రితం నిర్వహించిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను గుర్తు చేస్తూ తన హయాంలో ఈ ప్రతిష్టాత్మక కాంగ్రెస్‌ను నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెక్యులర్, సమాఖ్య, ఫెడరల్, ప్రజాస్వామ్య విలువల రక్షణకు కృషి చేస్తుందన్నారు. సమక్క, సారలమ్మ, కుమ్రంభీం, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భారత దేశ చరిత్రలోనే గొప్పవని కొనియాడారు. న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగ విశ్రాంత ప్రొఫెసర్ మృదులా ముఖర్జి మాట్లాడుతూ.. 1984లో తన పరిశోధన 'ప్రాజెక్ట్ ఆన్ ఫ్రీడం స్ట్రగుల్' కోసం వచ్చిన సందర్భాన్ని గుర్తు చేశారు. 82వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్, న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ఆదిత్య ముఖర్జీ తన ప్రసంగం 'జవహర్ లాల్ నెహ్రూ ఇన్ అవర్ పాస్ట్ , ప్రజెంట్ అండ్ ఫ్యూచర్' అనే అంశంపై ప్రసంగిస్తూ చరిత్ర తుంగలో తొక్కబడుతోందని, నెహ్రూను చాలా కఠోరంగా చూపిస్తున్నారని, దేశ విభజన సమస్య, పాకిస్తాన్, చైనా సమస్య, వ్యవసాయ సంక్షోభం, కశ్మీర్ సమస్యతోపాటు ఇటీవలకాలంలో విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, రాజ్యాంగ సవరణ, ప్రజాస్వామ్యానికి ప్రశ్నార్థకంగా మారాయన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ చరిత్రకారుడు రామచందర్ గుహకు 'లైఫ్ టైం అచీవ్‌మెంట్' అవార్డు ప్రకటించారు. 81వ సెషన్‌లో జరిగిన సమావేశాల పుస్తకాల సంపుటిని ఆవిష్కరించారు. ఏడు ఉత్తమ పుస్తకాలు, పది ఉత్తమ పత్రాలకు అవార్డులు, నగదు బహుమతిని ప్రకటించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు స్వాగత ఉపన్యాసం చేశారు. లోకల్ హిస్టరీ కాంగ్రెస్ సెక్రటరీ ఆచార్య టీ మనోహర్ వందన సమర్పణ చేశారు. 1030కి పైగా పత్రాలు సమర్పించారు.దేశవ్యాప్తంగా 1200 మంది ప్రతినిధులు హాజరైనట్లు, ఇద్దరు విదేశీ ప్రతినిధులు, యూఎస్ఏ, ఉజ్బెకిస్తాన్ నుంచి ఒక్కొక్కరు హాజరైనట్లు వీసీ తెలిపారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్ ఏ నదీం రేజావి పాల్గొన్నారు.

# అంపశయ్య నవీన్‌కు 'నేరెళ్ల' స్మారక పురస్కారం

హనుమకొండ చౌరస్తా : మిమిక్రీ ఆర్టిస్ట్ వేణుమాధవ్ 92వ జయంతి సందర్భంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని వేణుమాధవ్ కళాప్రాంగణంలో నేరెళ్ల వేణుమాధవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ అంపశయ్య నవీన్‌కు స్మారక ప్రతిభా పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



అంపశయ్య నవీన్‌కు నేరెళ్ల వేణుమాధవ్ 25వ స్మారక ప్రతిభా పురస్కారం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

# 31న సోమనాథ కళా పీఠం పురస్కారాలు

పాలకుర్తి డిసెంబర్ 28 : తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుడి జన్మస్థలమైన పాలకుర్తిలోని సోమనాథ కళా పీఠం సాహిత్య, సాంస్కృతిక వేదిక 2021–22 పురస్కారాలను ఈ నెల 31న మండల కేంద్రంలో సోమేశ్వర ఆలయ ప్రాంగణంలో ప్రదానం చేస్తామని కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. సోమనాథ కళాపీఠం పురస్కారాల గ్రహీతల ఎంపిక ప్రక్రియ పూర్తయిందన్నారు. సోమనాథ సాహిత్య పురస్కారానికి డాక్టర్ కానుకుర్తి శెట్టి సోమశేఖర్, సోమనాథ సామాజిక శోధన పురస్కారానికి డాక్టర్ నలిమెల భాస్కర్, సోమనాథ రంగస్థల పురస్కారానికి మంచాల రమేశ్, పందిళ్ల శేఖర్‌బాబు, రాజయ్యశాస్త్రి, స్వచ్ఛంద భాషా సేవ పురస్కారానికి డాక్టర్ మైథిలి అబ్బరాజు, వీరమనేని చలపతిరావు, సాహిత్య పురస్కారానికి ఎంఎస్ ఆర్ వెంకటరమణ, ముశం దామోదర్‌రావు, ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారానికి డాక్టర్ సీఎస్ ఆర్ ప్రభు, డాక్టర్ రాపోలు సోమయ్య, ప్రతిభా పురస్కారానికి డాక్టర్ అరూరి మహేందర్, దేవగిరి రాజయ్య, స్మారక బిరుదుకు బూస రేణుకారాధ్య ఎంపికైనట్లు తెలిపారు. సమన్వయ కర్తలుగా రాపోలు ఆనందభాస్కర్, డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, డాక్టర్ టీ శ్రీరంగస్వామి, మార్గం లక్ష్మీనారాయణతో కూడిన నిర్ణాయక మండలి ఈ పురస్కారాలకు అర్హులను ఎంపిక చేసింది.


